# విశ్వేశ్వరుడి రేవు

తెల్ల జరీ చీర కట్టుకుని, తళతళలాడే ముఖంతో చంద్రకాంతపు పూల నవ్వుతో శరత్తు, రాజమహేంద్రవరం విశ్వేశ్వరుడి రేవులోకి వచ్చింది! ఆ రావడం చడీ చప్పుడూ లేకుండా మెల్లగా వచ్చినట్టుంది, రెల్లుపూలు వింజామరల్లా విచ్చుకుని గాలికి నెమ్మదిగా కదులుతున్నాయి.

గణపతిశాస్త్రి వెన్నెలషికారు చేద్దాం అన్నాడు, అక్కడ. రాత్రి తొమ్మిది గంటలయింది. ఆ రేవులో జన సంచారం తక్కువ. దగ్గర వూరి గుడిసెల ఇల్లాలు ఎవరో ఆఖరు కుండెడు నీళ్ళు రేవులో ముంచుకొని వెళ్ళిపోయింది.

పిట్ట మనిషి లేరు. గుళ్ళో గంటల చప్పుడు కూడ క్రమంగా తగ్గిపోయింది. "పున్నమి రాతిరి పూచిన మాలతి సన్నని యెలుగున జారెడు గౌతమి !"

అనుకుంటూ రేవులోకి దిగాను. గణపతి వచ్చి ఉంటాడని ఊహ! ఎడా పెడా రెల్లుపొదలు! ఊగే పువ్వులు, పువ్వుల మీదనుంచి బొట్లు బొట్లుగా వెన్నెల.

రేవుకు దగ్గరగా ఒక మంచి చోటు ఎంచుకుని కూర్చున్నాను. గణపతి రాలేదు. నిద్ర వస్తోంది. అప్పుడే? అవును. మంచి సమయం చూసుకు వస్తుంది ఈ దరిద్ర నిద్ర. "ఇంత కమ్మనైన రాతిరి తెలవారి పోవక ఇదే గతి నాకయి నిల్వరాదాకో" ఎవరన్నారోగాని నా కోసం అన్నట్టుంది.

రెల్లులో ఏదో జరజరలాడింది. పాము కాదుకదా! పడుచువాడి మెదడులో పగబట్టిన ఊహలా పాము గాబోలు. పామును చూడాలని ఉంది. కాని ఆ ధైర్యం నీ కెక్కడిదీ ?

నల్లని కెరటాలతో చలచల్లగా కదిలిపోయే గోదావరిని చూస్తున్నాను. రామాయణంలో వాల్మీకి అన్న మాట జ్ఞాపకం వచ్చింది. ఆంజనేయులు ఆకాశంమీద ఎగురుతూ ఉంటే ఆకాశం సముద్రంలాగా, సముద్రం ఆకాశంలాగా ఉందట :

చూడగా చూడగా గోదావరి స్వచ్ఛమైన ఆకాశంలాగ మారిపోయింది. రెల్లు పువ్వులు క్రమంగా ఆకాశం మీద తెల్లమబ్బుల్లా కనపడుతున్నాయి. నీటిమీద తళుకులు ఆకసంలో చుక్కలైపోయాయి.

భుజంమీద మెత్తని చెయ్యిపడింది. కనురెప్పలు బరువుగా ఉన్నాయి. కష్టపడి కళ్ళెత్తి చూశాను. చిన్న మబ్బుమీద కూర్చున్నాను. 'ఫోమ్' దిండుమీద చదికిల బడ్డట్టుంది. నిద్రా రాక, మెలకువా కాక, కలగా పులగపు ఊహలు — రెల్లుపూగుత్తి బుజానికి రాసుకుంటూన్నదనుకున్నాను. కాదు చెయ్యి, క్రియాపదం కాదు నామవాచకమే. గాజులుండవలసిన చెయ్యి. కాని లేవు. వెన్నెల బొమ్మ, అన్నమయ్య అన్నట్టు ఒక తెలిమబ్బు చుట్టబెట్టుకుని ఒకటి పైటగా వేసుకుంది. అది తడి మబ్బు గాబోలు! వక్షఃస్థలానికి అంటుకుని శరీర రేఖలను దాచకుండా ఉంది.

ముఖానికి బొట్టులేదు, కాటుక లేదు. శరణాలయంలోని 'వైదేహి' జ్ఞాపకం వచ్చింది.

“వైదేహీ!”

“ఊఁ”

“ఏం”

“ఏమీలేదు” నవ్వింది అనుకున్నాను. దేవకన్యలు నవ్వరు.

భుజంమీది చేయి ముందుకు జారింది. చెంపలు చెంపకు తాకు తున్నాయి. 'మత్తు', మత్తుకాదు గమ్మత్తు “మదిరా?” కాదు “మదిరేక్షణ” వెచ్చని నిట్టూర్పులు కంఠం దగ్గర ఒక్క నిమిషం.

ఎదురుగా, వెన్నెల కిరణాల్లో స్నానంచేసి ముస్తాబై నిలిచిన స్త్రీ మూర్తి! చేతితో ఒక మబ్బును దగ్గరగా లాగి దాన్ని ఆనుకుని నిలిచిన సుందరి!

మాటలాడకుండా చూస్తుంది.

మాట్లాడితే బాగుండును.

దేవభాష అర్థంకాదు. అది సంస్కృతం అనుకునేవు!

ఆమె కళ్ళల్లో దేవతాభాష. దేవత స్త్రీలింగం— ఆ భాషకు కళ్ళు ప్రత్యయాలు, నవ్వు కారకం! అర్థం కాకపోతే నీ ఖర్మం.

కళ్ళతో చిరునవ్వులతో చాలా మాట్లాడినట్లుంది మానవుడు—'దుము వుల' మానవుడు తెల్లబోయి చూస్తున్నాడు. మెల్లగా జాలిగా దగ్గరకు వచ్చి

ఇంకా అర్థంకాలేదా? అన్నట్టు చేయి పట్టుకు గుంజింది- సాభిప్రాయంగా మబ్బుల మెట్లు దాటుకుంటూ వెళ్ళుతూ వెంట రమ్మని సంజ్ఞ చేసింది.

నరుడు హఠాత్తుగా కిందకు చూశాడు. అగాధం. కళ్ళు తిరిగి గోదావరిలో పడ్డాడు.

* * *

గణపతి ఎంత సేపటినుంచి చేయి పట్టుకు గుంజుతున్నాడో - కళ్ళు విప్పి చూశాను.

“ఇప్పుడే వచ్చాను, ఆలస్యం అయింది. ఏమిటా నిద్ర?” అన్నాడు. చెప్పాను.

“అబ్బాయి! జీవితం అంటే ఒక అనుపలబ్ధవస్తువుకోసం చేసే మహా ప్రయాణం! చుక్క దొరకదు. చూడడం మానం. కలలు కని బత కలేం- కర్తవ్యం తప్పదు.” కొంతసేపు ‘యువకులు - ఆదర్శాలు’ - గురించి మాట్లాడాం. నిద్రముంచుకు వస్తోంది.... ఇళ్ళకు బయలుదేరాం.

తెల్లవారింది. ఒక దూత వచ్చాడు. ‘రేపు మధ్యాహ్నం పెళ్ళి చూపులు.’

ఎక్కడికేనా పారిపోదామనిపించింది.

మనస్సు నేలమీదకు దిగలేదు. నాకళ్ళు ఇంకేమి చూడడానికీ సిద్ధంగా లేవు. దూత చాలా గడుసువాడు, కనిపెట్టాడు. “బాబూ, సందే హించకు. ఎక్కడో అమాయికుడిలా ఉన్నావు. చూసిన వన్నీ అయి పోతాయా? చూడు, నచ్చలేదని చెప్పేసెయ్యి. బస్. నా రాక నీ పోక సార్థకం అవుతాయి.” వదల్లేదు. బయల్దేరాం.

ఓహో- మర్యాదలు- ప్రత్యుత్థానాలు- కాఫీలు- టిఫిన్లు వైదిక సంపత్తి గడ్డకట్టుకుని ఉంది. ఆ వైదిక పరిభాషల్లో ఆచారకాండలో ఊపిరాడడంలేదు.

పెండ్లికూతురి పాతవాసనలో కొత్త పాటలు. ఆదరా బాదరా చేసిన అలంకారాలు. ముఖంవేపు చూడలేదు. బుజంవేపు చూశాను, చుక్కల తెల్లజాకెట్‌లో జారిన సున్నని లేతచేయి. చాలు అన్నారు. లేచాం.

లాంఛనంగా వెనకనించి ఉత్తరం రాస్తాం అన్నారు. కాని పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇష్టానిష్టాలతో పనిలేదు. "ఆడపిల్లకు ఏమి ఇష్టానిష్టాలు? మగవాడికా, చేస్తే అదే ఇష్టం అవుతుంది. ఇన్ని చూస్తే అయినట్టే". ఇదే నేపథ్యంలో కలకలం.

మళ్ళా యథాప్రకారం. రాజమండ్రి వైగ్రాంరోడ్డులో అద్దె గుహ; రెండు పేజీల ఉత్తరం. నా ఆదర్శాలు— పెండ్లి మీద ఉపన్యాసం. పిండితాంశం— పెండ్లి వద్దు. ఇష్టంలేదు. లక్షణంగా అడ్రసు రాశాను. కసిగా పోస్టు చెయ్యాలి. వారం అయింది.

వరదాచార్యులు అర్జంటుగా గుంటూరు వెడుతున్నాడు. స్టేషనుకు రమ్మన్నాడు. కాలక్షేపంగా ఒక పుస్తకం తీసుకుని బయలుదేరాను.

రైలు రావడానికి ఆలస్యం ఉందన్నారు. పుస్తకం తెరిచాను. హతవిధీ! ఉత్తరం పోస్టుకాకుండా సురక్షితంగా అందులో ఉంది! కొయ్యబారిపోయాను.

వరదన్న చూసి సంగతి తెలుసుకున్నాడు. నవ్వాడు. నేను ఏడ్చాను. "ఇది ఈశ్వర సంకల్పం తప్పించుకోలేవు" అన్నాడు. అట్లాగే జరిగింది.

●